# పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశానో

తెల్లవారు ఝామున అయిదు గంటలకి, అలవాటు ప్రకారం సుబ్బమ్మగారు ప్రక్కమీంచి లేచి స్నానానికని బయటకొస్తూంది....

ఆ సమయానికే - సావిత్రి కూడా యువతల గదిలో నుండి వచ్చింది. ఎప్పుడూ అంత నేగిరం లేవకపోయినా, ఆనాడు తెలివి వచ్చేసింది. మరి నిద్ర రాక లేచి వస్తూంది.

ఇక సరిగ్గా అదే సమయానికి, సత్యం కూడా తనకేదో పనివుండి తయారవడానికని లేచి మొహం కడుక్కొని కాలకృత్యాలు తీర్చుకుందికని బయటకు వస్తున్నాడు. ...

వీడీకి తగిల్చిన బెడ్‌లైటు గుడ్డికాంతి - తెల్ల తెల్లవారుతూన్న వెలుతురులో కలిసిపోతూంది. యిలాటి వెలుగు నీడల్లో.. అకస్మాత్తుగా అనుకోకుండా, ముగ్గురూ తారసిల్లడం... ఒకరి మొఖాలు ఒకరు చూసుకోడం తటస్థించింది - అయితే ఎవరెవరు ఎవరెవరి ముఖాలని మొట్టమొదటి క్షణంలో చూసుకున్నారో అది వారికే తెలియాలి!

ఈ సంఘటన వల్ల - చూసుకోడం జరగ్గానే ఏదో సందేహం. ముగ్గుర్లోను క్షణంలో పుట్టి, చప్పున వెనక్కు తగ్గారు. ఆ జంకడం వారికి తెలియకుండానే... జరిగిపోయింది... ముగ్గురూ కూడా... తమలో - ''నిద్ర లేవగానే యీ ముఖం చూశానే''.. అని ... తప్పకుండా అనుకున్నారు. అందుచేతే వెంటనే బయటకు రావడానికి సందేహించారు. మళ్ళీ అంతట్లోనే - తిరిగి ఆ విధంగా వెళ్ళి పడుక్కుంటే ఎదుటివారే మనుకుంటారో అన్న మొహమాటం వల్ల, ఆ సందేహాన్ని కనబడనివ్వకుండా... మామూలుగానే... ఏమీ అనుకోనట్టుగానే - ఎవరి మానాన్ని వారు తలలు వంచుకొని- ఎవరి పనిలోకి వారు వెళ్ళేరు.

తిరిగి వెళ్లి పడుక్కొని, తరవాత లేస్తే, ఆ ప్రభావం పోతుందని, ఏమీ ఫరవాలేదని అనుకొని కొందరలా చేస్తుంటారు... కాని చూసేయటం - జరిగిపోయిందా లేదా ? వెళ్లి పడుక్కొంటే, కాలదోషం పడుతుందా ?.... జరిగేదేదో జరక్క తీరదు... అని వీళ్ళు అనుకున్నారు... కాని ఆ పిచ్చి నమ్మకం మాత్రం, ఆ క్షణంలో ముగ్గుర్లోనూ అనుకోకుండా కలిగింది.. ఆ వెంటనే - ఏమిటి! యీ పిచ్చి నమ్మకం ? మొఖం చూస్తే ఏమౌతుంది ? ఛాదస్తుల్లా యిలాటివి నమ్మడమా ! అంతా భ్రమ అని అనుకున్నారు గాని... మనసుల్లో మాత్రం రోజల్లా ఏమౌతుందో ! ఎలా గడుస్తుందో ! అని పీడిస్తూనే వుంది, ఆ అనుమానం.

★

సత్యం గుమ్మందిగి బయటకి నడవగానే - పడాలుమని - కాలిని రాయి ముద్దులాడింది, కాలి బ్రొటనవేలి బొట్ట బ్రద్దలయి గోరు, మొసలి నోరులా, తెరుచుకుపోయింది. 'అమ్మా' అని కూలబడిపోయినాడు... ఒక్కసారి ప్రాణం పోయినంత పని అయింది.. నెత్తురు కట్టడం లేదు.... అంత బాధలోనూ కూడా ... అతనికి స్ఫురణకి వచ్చింది... 'చూపెట్టిందిరా తడాఖా ! వుత్తినేపోతుందా ? అయినా లేవగానే దాని ముఖం చూశాను! ఇక్కడితో వూరుకుంటే వుంది దారి!' అని అనుకొని కాలికి గుడ్డ చుట్టుకొని, కాస్త తెప్పరిల్లి తిరిగి వెళ్ళిపోయినాడు. ...

సావిత్రి ముఖం కడుక్కొని స్నానాలగది లోంచి వస్తూంటే చీరకొంగు తలుపుకు తగులుకొని, చర్రుమని చిరిగిపోయింది, మూరెడు మేర!...

"ప్చ్... ప్చ్... ప్చ్.... ఖర్మ... యింకా నెల్నాళ్ళు కాలేదు కొని. నిక్షేపంలాంటి చీర.. ఇలా అయిపోయింది!" అని విసుక్కుంది. ఆ వెంటనే... అవును నిద్ర లేవగానే... వెధవముండ ముఖం చూశాను. మరేమవుతుంది!" అని అనుకుంది.

ఇంక సుబ్బమ్మగారి సంగతి, ఆమె విధవే అయినా జుత్తు వుంది. వ్రతం, ఆచారం, కూడా కద్దు. ఆవిడ స్నానం కానిచ్చుకొని... పొయ్యి అంటిద్దామని.... కిరసనాయిలు తెచ్చి బొగ్గుల్లో పోయబోయింది. అదేం ఖర్మమోగాని... చేయి జారి సీసా పాళంగా డుబుక్కున క్రింద బడింది. యిల్లు వళ్ళు అంతా గుప్పుమని కంపు కొట్టేసింది... ఆవిడేం చేస్తుంది ?... "అయ్యో ! యిదేమిటి ప్రొద్దుటే!" అని అనుకుంది. అంతటితో వూరుకుందా అబ్బే లేదు... ఆవిడ కూడా... ఇది మరేం కాదు... లేచిన వేళా విశేషం... చూచిన ముఖ విశేషం." అని అనుకుంది తనలో...

ఇక్కడే వుంది చిన్న విశేషం... చూశారా... వెధవ ముండలుగాని... ఇంకెవరయినా యిలాటి- చూడరాదు అని చెప్పిన వారిని చూసి... పైవారు ఎలా భావిస్తారో.. అలాగే... వీరిని చూసినపుడు వారూ అనుకుంటారు.... వారికి వీరు శకునాలు అయితే వీరికి వారు శకునాలు. ...

★

సత్యం ఆఫీసుకి గబగబా వెళ్ళాడు. అంత తొందరగా వెళ్ళినా అరగంట లేటయిపోయినాడు... రోజూ రాని హెడ్‌క్లర్కు, అప్పటికప్పుడే - భూతంలా వచ్చి కూర్చున్నాడు... 'ధృవనక్షత్రంతోనే వాడూ లేచినట్టున్నాడు. వీడి దుంపతెగా !' అని అనుకున్నాడు సత్యం.

సత్యం లోపలికి వెళ్ళగానే ;

"ఇప్పుడా తీరుబడి అయింది ? రోజూ యిలాగే జరుగుతోందన్నమాట ! రౌతు మెత్తనయితే, గుఱ్ఱం మూడు కాళ్ళతో పరుగెట్టదూ మరి !.... అన్ని పనులూ పనిలోకి వచ్చిన తర్వాతే జరుపుకోవాలి! బజారులు చెయ్యాలి ! విశ్రాంతి కావాలి ! కాఫీలు, టిఫిన్లకి, యిందులోనే టైము కావాలి ! గంటలకొద్దీ లేటు రావాలి ! మళ్ళీ టైము అయేసరికి ఒక్కనిముషం ఎక్కువ వుండమంటే వీల్లేదు !....కానీండి ఏమయినా అంటే... నే చెడ్డవాణ్ణి!" అని అన్నాడు హెడ్‌క్లర్కు.

"ఎంత మాటన్నావురా ! బదిరాంధక శవమా ?" అనుకొని "లేదండీ ! వస్తూంటే కాలికి దెబ్బతగిలింది ఇదుగో... అంచేత" అని చూపబోయినాడు సత్యం.

''అవును, ఏదో ఒక కారణం... అందులోనూ... ఇవాళ ఆఫీసరు వస్తాడు... అని కదా! నేను వచ్చి... కూర్చున్నది! ఆ మాత్రం బాధ్యత వుండొద్దూ! ... ఉదయం లేచి ఎవరి మొఖం చూశానో! యింకా నయం యీపాటికి దిగబడలేదు - వస్తే నీకూ నాకూ, వాయిద్యాలు మ్రోగేవి!'' అని అన్నాడు ఆ హెడ్‌క్లర్కు. ఎవరి మొహం చూశాను చెప్మా అని జ్ఞాపకం తెచ్చుకుంటూ.

అది వినగానే సత్యానికి జ్ఞాపకం వచ్చింది.

''అవును. నేనూ ఇలాగే ఒకరి మొఖం చూడబట్టి యింతవరకూ వచ్చింది.... లేకపోతే బాగానే వుండేది. ఆఫీసరు వస్తాడని కదా! అతడు అంత వేగిరం వచ్చేడు. లేకపోతే తను మాత్రం వస్తున్నాడా! అయినా ఆఫీసరు వస్తాడని తనకేం తెలుసును! ఇంతకీ... లేచి చూచిన మొహం విశేషం ఇది. అతనితో వాదించినా ఏం లాభం,... అని అనుకొని వూరుకున్నాడు.

''ఉద్యోగం అయేవరకూ నానా గడ్డి కరిచి నానా వాళ్ళనీ ఆశ్రయించడమున్నూ... ఉద్యోగం అయేక, ఈ విధంగా ఖాతలు లేకుండా నాకేం! అన్నట్టు వుండడమూ'' అని గొణుక్కున్నాడు హెడ్‌క్లర్కు.

''ఇంతమంది రిటైర్ అవుతున్నారుగాని, నీకని విరగడవడం లేదు బాబూ!'' అని వళ్లు మండి అనుకున్నాడు సత్యం.

అది మొదలు 'ఇదేమిటిలా అవుతూంది. ప్రతీదీ!' అనే ఆలోచన అతడిని పట్టుకుంది. దానితో బుర్ర సమంగా పనిచేయక, చిన్న చిన్న పొరపాట్లు డ్యూటీ జరుగుతున్నంత సేపూ జరుగుతూనే వున్నాయి.. పొరపాటు జరిగినప్పుడల్లా... ''ఆ ముఖం చూడ్డం చేతనే ఇలా జరిగింది'' అని అనుకుంటూనే వున్నాడు...

మళ్ళీ వెంటనే - ఆమె మొఖం చూడబట్టి ఇక్కడితో సరిపోయిందేమో! లేకపోతే- ఆ ఆఫీసరే ముందరవచ్చి చూస్తే ఏమయేది! అని కూడా అనుకున్నాడు. అనుకున్నా... మరో అనుమానం వెంటనే తోచింది. అసలు ఆ ముఖం చూడకుండా వుంటే, ఆలస్యమూ జరగదేమో! ఆ ఆఫీసరూ రాడేమో! అని కూడా అనుకున్నాడు.

ఈ విధంగా అతనికి సరి సరి విధాల ఆ విషయమై ఆలోచనలు పోతున్నాయి... ఆ ఆలోచనలని కట్టలేకుండా వున్నాడు, అందుకతనికే ఆశ్చర్యం వేసింది.

ఆ యింతలో ఆఫీసరు పర్యవేక్షణకి వచ్చాడు. అందరూ లేచి మర్యాద చూపారు... ఆ ఆఫీసరేవేవో హెడ్‌క్లర్కు నడిగి, వెళ్లిపోడానికి తిరిగేడు, అందరూ వేయి వేయి దేవుళ్ళకి మొక్కుకున్నారు. అతని కంట ఏమీ పడనందుకు. శగటు వంటి ఆయన దృష్టిపథంలో తాము కనబడనందుకున్నూ... 'లేచి ఎవరిమొహం చూశామో బ్రతికి బయటపడ్డాం!' అని అందరూ నిబ్బరపడ్డారు.

వెళ్ళిపోతూ వెళ్లిపోతూన్న ఆఫీసరు దృష్టి దురదృష్టవశాత్తూ... ద్వారం ప్రక్కనే ఉన్న... సత్యం మీద పడింది... పిల్లికి ఎదురుగా తారసపడిపోయి... బిక్క మొహం వేసి బితుకు బితుకుమనే ఎలకపిల్లలా అయిపోయాడు మన సత్యం.

''నీ యూనిఫారం ఏదీ!'' అని పిడుగులా అడిగాడు ఆ ఆఫీసరు.

సత్యానికి అది విన్నాక జ్ఞాపకానికి వచ్చింది - ఆ యూనిఫారం సంగతి - అలవాటు ప్రకారం వచ్చేశాడు చేతులూపుకుంటూ... అయినా ఆఫీసరు వస్తాడని ఎవడికి తెలుసు? వచ్చినవాడు, ముందుగా తెలియ చెప్పొద్దూ.... అంత సడన్‌గా ఏ ఆఫీసరూ రాకూడదు. వస్తే ఇలాటివి అడక్కూడదు... ఎప్పుడూ నామకానికి యూనిఫారం తెచ్చి కుర్చీకి తగిల్చేస్తున్నారుగా ! అవేం తొడుక్కుందికి పనికిరావాలా ? ... పోనీ... ఆలస్యంగా వచ్చానని అడిగిన ఆ హెడ్‌క్లర్కు... వాడి బుర్ర ఏదీ అంట ? వాడేనా అడగొద్దూ!... అడిగితే, వెంటనే తెచ్చుకుందునే... వచ్చిందిరా గొర్రి! అనుకున్నాడు! ఏమీ జవాబు చెప్పకుండా తప్పు ఒప్పుకున్నట్టు తలొంచుకొని నిలబడి వూరుకున్నాడు... ''నా మీదే సడాలీ! నీ దృష్టి! యింతకీ... ఆ ముఖం లేవగానే చూశాను! ఎవరిని అని ఏం లాభం ?'' అని అనుకున్నాడు.

''ఇదీ క్రమశిక్షణ'' అని ఆ హెడ్‌తో అంటూ... ''ఇంక మీద జాగ్రత్తగా వుండాలి! ఇది నౌకరీ! నువ్వు పుత్తి పుణ్యానికి చేయలేదు. కాబట్టి - నిబంధనలకి - నీ డ్యూటీ అంతకాలం లొంగి వుండాలి!'' అని చెప్పి... వెళ్లిపోయినాడు.

తనలో కూడా తప్పు వున్నా హెడ్ మాత్రం గుడ్లగూబలా 'తర్వాత చెప్తాను!' అన్నట్టు సత్యం వైపు చూస్తున్నాడు.

సత్యానికి తెలుసు పొరపాటుకు ప్రాయశ్చిత్తంగా జరిమానా తప్పదని...

ఆఫీసరు వెళ్లగానే...

''అనుకున్నంత చేశావోయ్! నా పరువు తీశావు! ఛా!'' అని చీదరించుకున్నాడు హెడ్ క్లర్కు. ''లేవగానే ఎవరి మొహం చూశావోయ్! ఇవాళ'' అని పరామర్శించేరు తోటిక్లర్కులు.

సత్యం మరోసారి తను ఉదయాన్ని లేవగానే చూచిన మొఖం జ్ఞాపకం చేసుకొని తలవంచుకు వూరుకున్నాడు.

ఇహ ఆనాడల్లా అలా జరక్క తప్పదని - తను భరించక తీరదని అనుకున్నాడు. మొత్తం మీద ఆఫీసుపని అయిపోయింది. యింటికి వచ్చేద్దామని గబగబా వచ్చేస్తున్నాడు... వచ్చేస్తుంటే మధ్య దారిలో నలుగురు స్నేహితులు ఎదురయినారు; ఓహో! అంటే - ఓహో!! అనుకున్నారు. కాని సత్యానికి మాత్రం ఆ వేళకి ఉత్సాహంగా లేదు, వాళ్ళతో అట్టేసేపు మాటాడాలని కూడా లేదు. అసలు వారు ఆ సమయంలో కనబడి పలకరించడమే ఇష్టంలేదు.. ఆఫీసులో గొడవలు, ఆలోచనలు, వీటివల్ల బుర్ర వేడెక్కిందేమో ఇంటికి వేగిరం పోయి నిర్మలంగా కూర్చుందామని అనుకున్నాడు. కాని వీళ్లు తగిలేరు. ఇంక ఆ స్నేహితులెలాటి వారు! అంత సుళువుగా వదిలే ఘటాలు కారు. వారిని చూడగానే 'హతోస్మి' అనుకున్నాడు.

''ఏమిట్రా సంగతి ? ఎక్కడా దర్శనాల్లేవే!'' అని ఒకడు అడగ్గా.

''రావోయ్ అలా తిరిగివద్దాం ! ఆఫీసు వదలగానే అంత వేగిరం ఇంట్లో ఎటెండెన్సు ఇవ్వక్కర్లేదులే!'' అన్నాడు మరొకడు.

'ఎక్కడికి వెళ్తాం లెమ్మా!' అని ఒకసారి అన్నా... సత్యం వెళ్లక తప్పలేదు. ఎలా కాదనగలడు? వాళ్లు చాలా సార్లు తనతో తిరిగినవాళ్లు.

వెళ్లి వెళ్లి అందరూ ఒక హోటల్లో దూరారు. సత్యం గాభరా పడటం తప్పదు కదా!... ఫలహారాలయ్యాక కాఫీలలోకి వచ్చారు... ఇక్కడే వాళ్ళని, వాళ్ల మొహాలనీ చూడవలసింది... ఎవరికి వారే అతి తాపీగా కాఫీ తాగడం మొదలెట్టారు. ఒకబొట్టు పెదవులకి అంటగానే ఉఫ్ అని పీల్చి క్రిందని బెట్టి వూదుకుంటూ ''అబ్బా వేడిరా!'' అని మాటాడుతూ తాగుతున్నారు. ఎందుకంటే ఎవడయినా ముందుగా తాగేసి.. బిల్లు చెల్లిస్తాడేమోనని.... ఒకటికి నాలుగుసార్లు చల్లారబోసుకుంటూ, తక్కినవాళ్ల గ్లాసులోని పరిమాణాలని పోల్చుకుంటూ తాగుతున్నారు. 'వీడు యింకా త్రాగుతున్నాడు. కాబట్టి ఇవ్వలేదు... లేకపోతే యిచ్చేవాడే' అని అనుకుంటారు అని వాళ్ల ఊహ.

కాని ఆఖరికి అందరికీ విసుగెత్తి 'లెండ్రా!' అని అనుకొని అందరూ ఒకసారే లేచారు. ఇంక, పర్సులు అందరూ అతి తాపీగా తీయడం, వెతికిన జేబే వెతకడం - పర్సులో చూసిన కవరే నాలుగుసార్లు చూడడం, లేకపోతే మూతి రుమాలుతో తుడుచుకున్నట్టు; చిల్లర లేనట్టు - ఎవరితోనో కలిపించుకొని... ఆ మాటల్లో వుండి బిల్లు సంగతి గుర్తించనట్టు... ఇలా ఎవరికి వారు ఆలస్యం చేయడం... వెనక్కి తగ్గుతూండడం చేస్తున్నారు. ఇదంతా ఎందుకూ? బిల్లు చెల్లించడం తప్పుతుందనే. ఎలాగయితేనేం ఆఖరికి....

'నీ దగ్గర వుందా! లేకనే ఇచ్చేదా!' అని ఒకడు సత్యాన్ని ఉద్దేశిస్తూ మహా ఖాతరు లేకుండా అడిగేడు. ఏమిటో సత్యం ఇచ్చేస్తున్నాడు కాబట్టి తను ఆగినట్టు.

సత్యం అదివిని తబ్బిబ్బయినాడు. ఎలా కాదనగలడు? స్నేహితుడావిధంగా డొంకతిరుగుడుగా, పెద్దమనిషిలా తనని, బిల్లు చెల్లించమని చెబుతున్నపుడు కాదనగలడా! తనకి వాళ్లు ఎన్నిసార్లు ఇప్పించలేదు? ఏదయినా ఇంతేకదా? - ఒకరి దగ్గర ఏదయినా ఆశించామూ అంటే - వారికి మనం... మోమాటపడిపోక తప్పదు.... అని అనుకొని బిల్లు చెల్లించాడు. డబ్బిస్తున్నపుడు మాత్రం... ''లేచిన వేళ! ఇలా వుంది! ఒక్కొక్కరి ముఖం చూస్తే ఇంతే!'' అని అనుకున్నాడు.

ఆ తర్వాత ఎవరితోవని వారు వెళ్ళిపోయినారు.

★ ★ ★

మరి సుబ్బమ్మగారి సంగతి... పొయ్యి అంటించేప్పుడు సీసా జారిపోవడం మొదలు, వంట అయేవరకూ... చెప్పలేనన్ని సంగతులు జరిగేయి... వెధవ అగ్గిపెట్టి అరఘంట తంటా పెట్టిదొరికింది.. అంత అనర్థం ఏమిటోగాని... అడుగడుగునా మనిషి తడువుకుని పోయింది... ఆ పొయ్యి ఒక ఘంటకిగాని అంటుకోలేదు... వేరే బొగ్గులు వేద్దామంటే నిండుకున్నాయి. పోనీ కట్టెలంటించవచ్చు అనుకుంటే- పచ్చి ముద్దలు.. ఎలాగో వాటినే అంటించి ముక్కంట కళ్లంటా, గంగ భాగీరథులు ప్రవహించుతూ వుంటే పాపం ఆ గంగా భాగీరథి ఎలాగో కష్టపడి వంటకి కూర్చుంది.

సత్యానికి తొలిసారి కాఫీ ఇచ్చినపుడే... అందులో పంచదార మరచిపోయింది... అడిగితే జ్ఞాపకం వచ్చింది. బియ్యంలో తగినన్ని నీళ్లు పోయకపోవడం చేత... అన్నం... అటు గంజిదిగక...

యిటు అత్తెసరు గాక... ఏడవలేక నవ్వేవాడి మొఖంలా తయారయింది. అంత అనుభవశాలి అయి, వంటలో దిట్ట అయిన ఆమెకి యిలాగయితే ఎంత చిన్నతనం!

ఉదయం పది గంటల లోపునా నాలుగు సార్లు ఆ చల్లో చన్నీళ్ళలో స్నానం చేయవలసి వచ్చింది. శ్రేష్ఠంగా... మడికట్టుకుంటే, పిల్లడు ముట్టేసుగున్నాడు. రెండోసారి అంటు తగిలేసింది.. ఇలాగే నాలుగుసార్లూ అయింది. ఆఖరికి తడిగుడ్డలోనే వుండిపోయింది. నేతైన మడి కూడా లేకపోతే - ఎలా? ఉదక్కటే వాళ్లకు కొస వరకూ మిగిలేది... ఈ మడికి - చిన్న పిల్లలకి అసలు పడదు. మడికట్టుకుంటే వాలు, ఎలాగో తగిలేస్తారు! మడి బట్ట ఆరవేస్తే అటువయిపు మరి చూడకూడదు! చూశామా అంటే అది ఎలాగో అలాగ మైల పడిపోయే వుంటుంది.

ఈ విధంగా ఆ రోజల్లా ఆమెకి పొరపాటు జరగని పనిలేదు. అందుచేత ఆ రోజల్లా విసుక్కుంటూనే వుంది. విసుగువల్ల చికాకు, చికాకు చేత కోపం, దానితో మతిమరపు, మరపువల్ల పొరపాట్లు లవయినాయి. అయితే... సుబ్బమ్మగారికి... అందుకు కారణం తెలుసు - అంచేత అలా జరిగిన ప్రతి నిముషం... ''ఎవరి మొహం చూశానో... లేవగానే... చూశానూ... వూరికే విడుస్తుందా!'' అని అనుకుంటూనే వుంది.

★ ★ ★

ఇహ మిగిలింది సావిత్రి - ఆమెకి ఒక చీర చిరిగిపోడం తప్పించి రోజల్లా మరేమీ అనుకొనే పాటి జరగలేదు.. జరగలేదని ఆమె... సంతోషపడుతూనే వుంది... కాని ఆఖర్ని భోజనాలయ్యాక మాత్రం.. చిన్న జట్టీ వచ్చింది... ఇంక నిర్భయంగా రోజు గడిచేసింది అనుకొనేటప్పటికి, అనుకున్న అనుమానం నిజమయినట్టుంది. చూచిన ముఖ విశేషం వృధా పోనట్టుంది.

సత్యం ఆఫీసులో పడినగొడవ, దారిలో తగిలిన ఖర్చు పీటితో అతి చికాగ్గా ఇంటికి వచ్చాడు. రాగానే ఆలోచనలో పడిపోయినాడు - అలాగే ఎవరితోనీ మాటాడకుండా విచారిస్తున్నాడు.

కాలం గడిచిపోవాలంటే అన్నిటికన్నా గొప్ప అలవాటు ఆలోచన. ఆలోచిస్తూ ఉంటే కాలం తెలియదు. కొందరికి ఆటలవల్ల, కొందరికి - తిరగడం వలన, కొందరికి చదవడంవల్ల, మరికొందరికి పనులవల్ల, ఇలాటి అలవాట్లు, వ్యాపకాల వలన కాలం సులభంగా గడిచిపోతుంది. కళాకారులకి వారు కళకోసం చేసే కృషివల్ల సరిపోతుంది. అలాగే కొందరికి విచారంవల్లగాని, సంతోషం వల్లగాని, కలిగిన ఆలోచనలవల్ల కాలం తెలియదు ఇవన్నీ ఇలా వున్నా - కొందరు వారి వారి దీక్షలు తీరడానికి అనుకున్నది పూర్తికాడానికి, కాలం చాలడం లేదో! అని వాపోతూంటే ఇంకొందరు కాలం ఎలా గడుస్తుందా! అని బాధపడుతూంటారు ఇదెంత చిత్రం!

ఇలాగే సత్యం ఆలోచనలోపడి కాలం తెలుసుకోకుండా వుండగా, సావిత్రి భోజనానికి పిలిచింది. అప్పుడు చైతన్యం వచ్చి వెళ్ళాడు.

భగవంతుని ధ్యానించి, పరబ్రహ్మ స్వరూపమయిన అన్నం మొట్టమొదట నోట్లో పెట్టగానే - అర్ధనారీశ్వర రూపంలా స్ఫురించింది.... సగం... పలుకు... సగం ముద్ద!....

''ఇదేం ఇలాగుంది'' అని అన్నా... పొరపాటయి వుంటుంది అని లెక్క చేయలేదు. కాని...

తరువాత ఒక్కొక్క పదార్థం తీసి రుచి చూస్తూంటే... ఏముందీ ? ... ఒక్కటీ సవ్యంగా లేదు. ప్రతి వంటకంలోనూ, ఏదో లోపం. కూరలో కారం లావు! పులుసులో ఉప్పు లేదు... పచ్చడిలో పోపు లేదు... పోపులో మిరపకాయలు లేవు.... చారులో ఉప్పు లావు ! ఈ విధంగా వుంది. ... పాకకళ.... అతనికి ఒక్కసారి అన్నపూర్ణ జ్ఞాపకానికి వచ్చి జిహ్వ లాక్కుపోయింది. ఈ వంటకాలు నాలుకమీద పెడుతూంటే లాలాజలం ఇంకిపోయి నాలిక అడుక్కి లాక్కుపోతూంది.

"ఏమిటయింది ఈ రోజు... ఇంత శ్రద్ధ సోపేతంగా నవరుచులూ ఓడుతున్నాయి... పెళ్ళి చూపులకి వచ్చిన కాబోయే వియ్యాలవారికి... పిల్ల తాలూకు పాకకళ రుచిచూపించడానికి ఏ పెళ్ళి కూతురయినా వండిందా ఏమిటి ?" అని అన్నాడు సత్యం ! హాస్యంగా .

సుబ్బమ్మ అనుకుంటూనే వుంది. తినేసరికి ఎలా వుంటాయో ఏమంటారో అని.. ఒకరు చెప్పేవరకూ వేచి వుండక, వండుతున్నప్పుడే రుచి చూసి, ఇప్పటి నవనాగరికుల్లా వండడం ఆమెకు చేతకాదు. పాతకాలపు మనిషి... తను చెప్పినట్టు వంటవినాలిగాని వంట చెప్పినట్టు తను వినదు .. అందుకే. తను చేసిన వంట పాడుకాదని, అనడానికి వీల్లేదని, ఆమె ధీమా ! ... కాని ఆ రోజు అలా అయినంత మాత్రంతో ఆమె చేతి వంటని ఎవరూ వేలెత్తి చూపలేరు.... ఆమె చేతిపాకం అంటే ప్రతివారూ 'ప్రాణం లేచి వచ్చిందమ్మా !' అనవలసిందే ! అయితే ఈనాడు ఎందుకలా అయింది? మరెందువల్లా కాదు. ఆనాడు... ఆమె ప్రొద్దున్నే లేచి చూచిన ముఖ విశేషం.. అంతే . ... అలాగనే ఆమె అనుకొంది.

"ఏమయింది నాయనా ! బాగులేనా ?" అని అడిగింది సుబ్బమ్మగారు.

"ఏమిటో ఇవాళ నీ మనసు ఇక్కడ లేనట్టుంది. ఒక్కటీ నోటికెళ్ళడంలేదు... అయినా, ఉదయం లేచి ఎవరి మొహం చూశానో... ఎక్కడికి వెళ్ళినా ఇలాగే అవుతూంది... ఆఫీసులో జట్టీ... అవమానం... దారిలో అనుకోని ఖర్చు... ఇక్కడ పోనీ ... ఇంత రుచిగా, తిని హాయిగా పడుకుందామంటే - ఇలా అయింది... ఇంతకీ ప్రొద్దున్న లేచిన విశేషం ! అన్నీ అలాగే జరుగుతున్నాయి" అని అన్నాడు సత్యం, మరి వుండబట్టలేక.

సావిత్రి కూడ రుచి చూసింది. అనుమానం తీరక కాని, ఏది తిన్నా లోపలికి వెళ్ళడానికి బదులు పైకి తోసుకు వస్తూంటే... "ఔనండీ ! నిజమే ఈ రోజు మీ మనసు బాగులేనట్టుంది !" అని అంది. అది విని చెబుదాం అని ఎంతో కాలం నుంచి వేచివున్నట్టు ఆత్రుతగా -

"చెప్పకపోవడం ఏంగాని ! ఉదయం లేచి కుంపటి అంటించింది మొదలు యిప్పటి వరకూ ఏదో ఒకటి యిలాగే అవుతూంది... లేవగానే ఎవరి మొహం చూసేనో గాని ! యిలా ఎన్నడూ జరగలేదు. అంచేత అసలు నాకేం తోచలేదు. .. ఇవాళకి ఎలాగో ఎంగిలి పడండి! ఒక్కొక్కనాడు లేచిన ఘడియలూ- చూచిన మొఖాలూ అలాటివి ! ఏం చేస్తాం !" అని సుబ్బమ్మగారు తనని లోన పీడిస్తున్న అనుమానాన్ని వుంచుకోలేక వెళ్ళగ్రక్కింది.

ఆ మాటలు వినగానే సావిత్రి, సత్యం - ఒకరినొకరు గుడ్లు తేలవేసి చూసుకున్నారు. తర్వాత ఇద్దరూ - సుబ్బమ్మగారి వయిపూ... సుబ్బమ్మగారు వీరిద్దరివయిపూ... ఏదో దాక్కున్న భావంతో-

అనుమానాస్పదమయిన చూపులతో, సందేహాలతో.. చూసుకున్నారు!

ఇదంతా ఒక్క నిముషంలో జరిగిపోయింది.... అంతే... ఒకరినొకరు మరేం ప్రశ్నించుకోలేదు. కాని అందరూ లోలోన మాత్రం 'ఏమనుకుంటున్నారో ?' అని అనుకున్నా - అలాగనుకుందికి... వారికి తాను - ఆ సంఘటన గురించి అనుకుంటున్నట్టూ, అది తనలో ప్రభావం చూపెడుతున్నట్టూ, తాను దానిననుభవిస్తున్నట్టు ఎదుటివారికి తెలియాలనే అలా అన్నారు. అలాగు కనుక చేస్తే ఎదుటివారు తనని గురించి అనుకోక మానలేదు సుమా! అని చెప్పడానికే... అదో సమాధానంగా మనసుకి పూరట కలిగిస్తుంది.

ప్రస్తుతం వారి మనస్తత్వాలు అలాగున్నాయి.

మొత్తం మీద అందరూ ఏదో కడుపులు నింపుకొని పండుకొనబోయినారు... ఆ యింతలోనే సావిత్రి.... వంతు వచ్చింది....

చికాకులు మరిచిపోదలచుకొని నిశ్శబ్దంగా పడుక్కున్న సత్యాన్ని వెళ్ళి కదిపింది... సావిత్రి;

''ఏమండీ! నే చెప్పింది తెచ్చారా ?''

ఆమె ఏం చెప్పిందో ?.... ఇప్పుడడిగిన తర్వాత - తనికి స్పృహలోకి వచ్చి :-

''అన్నా... తేలేదు సుమా'' అని అన్నాడు.

''ఏం! డబ్బు తీస్కువెళ్లేరే! అయినా నాకెందుకు తెస్తారు లెండి! గుమ్మం దాటగానే నేను ఒకర్తెని వున్నానని, మీకు జ్ఞాపకం ఉంటుందా ? .... ఎన్నడూ నోరు విడిచి, అడగనే అడగను... అడిగితే.... ముచ్చట .... ఇలా తీరుతుంది. నెల్లాళ్ళయింది. మీ ఖర్చులు మీకు తప్పకూడదు.... ఇంతకీ ఏమీ అడగను కాబట్టి! మరోలాటిదయితే మీకు బావుండును...'' అని ఏకంగా ఒక్కసారి ... వర్షించింది సావిత్రి తనగోల, చెప్పేదేదో వినకండా.

జరిగింది శాంతంగా చెబుదామనుకున్నాడు గాని, ఇది విని కోపం రాక తప్పలేదు సత్యంకి.

''ఎందుకలా అరుస్తావు! చెప్పేది వినకండా!'' అని అన్నాడు.

''వినక్కర్లేదు! నాకవసరంలేదు! ... మీ డబ్బు... మీ ఇష్టం... నాకేం అధికారం వుందని! అడిగేందుకు ? ఏదో చాకిరీ చేస్తున్నా గదా! ఇంత తిండి పడేస్తారు. అదీ కాదంటే అలాగే పడి వుంటాం! అంతకన్నా.... ఏం చేయగలం! ఏమనడానికీ వీలా?'' ఇలాగంది సావిత్రి.

''నోర్ముయ్! .... ఎందుకలా వదలకండా, ఏమిటేమిటో కలిపించుగాని అంటావు... ఆ డబ్బుతో నా ఫ్రెండ్స్‌కి పార్టీ యివ్వక తప్పలేదు.... తెద్దామనే అనుకున్నాను, ఆ డబ్బు కాస్త అయిపోయింది... అదృష్టం అలా వుంది..కొంటాను.. కొంచం ఆలస్యం అయినంత మాత్రంలో... ఎంతముట్టుకు వచ్చింది... ఛీ! వెధవ ముఖం - ఎవరిది చూశానో - లేచిన దగ్గిరనుండి... ఒకదగ్గిరా శాంతిలేదు... మనశ్శాంతంలేదు... విసుగెత్తి పోతూంది... అని తలపట్టుగొని, మంచం మీంచి లేస్తూ అన్నాడు. ...

సావిత్రి కొంచం భయపడి తగ్గిపోయింది -

''అవును! మీకు అలాగే వుంటుంది. నేనెరి ముఖం చూశానో ఇవాళ లేవగానే - అని

వేసుకుంటున్నాను!.. లేకపోతే లేవగానే.. కొత్త చీర చిరిగి పోయింది... ఇప్పుడిలా .. అనుమానంగా ఉన్నట్టే- నానామాటలు వచ్చేయి, తెస్తారని ఆశపడ్డది, తేలేదు... ఒక్కొక్కరి మొహం లేవగానే చూస్తే ఇలా జరక్క తప్పదు. పోనీ లెండి. ఇంక పూరుకోండి. ఇక్కడితో... ఇకేం జరక్కుండా వుంటే, మీరు చెప్పి నంతా!'' అని సావిత్రి అనేసి పూరుకుంది... ఆమెకూడా ఆఖరికి తన మనసులో వున్న అనుమానాన్ని పైకి చెప్పేసింది.

'నువ్వూ! అలాగే అనుకుంటున్నావా ?'' అని ఆశ్చర్యంతో కూలబడ్డాడు ... ... ఇక్కడితో అందరూ ఆ రోజుకి పడుకున్నారు తిరిగి ఉదయం లేవడానికి.

ఒకరినొకరు సూటిగా నువ్వంటే నువ్వు.... అని చెప్పుకోలేకపోయినా తమలో బాధిస్తున్న అనుమానాలని, లేక... పైవారికి వారి వల్ల బాధపడుతున్నట్లు తెలియజెప్పాలన్న కాంక్షని, మనసుల్లో వుంచుకోలేక ఏదో విధంగా మాటల్లో బయటకి వెల్లడించేశారు. కాని ఎవరికి వారికే తెలియని విసుర్లు చూసుకున్నారో!

శకునాలు అందుకు నిదర్శనంగా, జరుగుతున్నాయని భావించేరు... అయితే... అది ఆ ముఖం చూసిన వేళా విశేషం వల్లనే అలా జరుగుతున్నాయా ? లేక, అలవాటైన రోజూ జరుగుతున్నా... కారణం, అనుమానం ఇది దీనినించే అన్న భావన.... మనసులో లేక, వాటిని గుర్తుపుంచుకోకపోవడం చేత తెలియడం లేదా?... ఇవేళ ఆ ముఖం చూడబట్టే ఇవన్నీ జరిగాయి తప్పడంలేదు అని ఊహిస్తూ అదే ప్రతి నిముషం నెమరు వేసుగుంటూండడం వల్ల ఏ చిన్న విషయం విరుద్ధంగా జరిగినా, అది అందువల్లనే అని అనుమానించడం జరుగుతూంది. యిది విచిత్రమయిన మానవ మనస్తత్వం.

ఈ విధంగా ప్రతి ఒక్కరూ ఎదుటి వారి వల్లే ఈ నష్టాలన్నీ కలిగాయని అనుకోడం ఎంత సహజమో, వారిని చూసిన ఎదుటి వారు కూడా అలాగే అనుకోడం అంత సహజమయ్యాను. అయితే నిజం ఏమిటి ? అందరూ ఒకటే. ఎవరిని చూసినా జరిగేది అంతే కదా ? నిన్ను చూసి వాడు అనుకుంటే వాడిని చూసి నువ్వు అనుకుంటావు. అలా అనుకోడమేగాని కొంచం ఆలోచిస్తే జరిగే విషయాలన్నిటికినీ మన తెలివి తక్కువతనమే కారణం గాని, ఇలాటి నమ్మకాలేమీ కావేమో అనిపిస్తుంది. కాని అలా అనుకోడాన్ని ఎవరూ వారించలేరు. .... అదే మానవుల్లో బలహీనత. అంచేత ఎదురుగుండా పెద్ద అద్దం పెట్టుగొని లేవగానే మీ మొఖం మీరే చూసుకుంటూండండి!.... ఎవర్నీ అనుమానించనవసరం వుండదు.

★ ★ ★

(ఆంధ్ర పత్రిక, 10-7-1957)